వాన ఆగింది.. నష్టం మిగిలింది

అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు శుక్రవారం నాటికి వరద ఉధృతి తగ్గలేదు. రోడ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. వరినారు మళ్లు, మిరపనారు వరదలకు కొట్టుకుపోయింది. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగును ఎంపీ మాలోతు కవిత స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. జిల్లా కేంద్రం శివారులోని మున్నేరు వాగును పరిశీలించి పూజలు చేశారు. నెల్లికుదురు మండలంలోని రావిరాల, వావిలాల, ఆలేరు గ్రామాలల్లో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ వరద ఉధృతిని పరిశీలించారు. డోర్నకల్‌లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ వరదతో దెబ్బతిన్న రోడ్లు, వరినారు మళ్లు, మున్నేరు, ఆకేరు బ్రిడ్జిలను పరిశీలించారు. కురవి మండలంలోని నేరడ–రాయినిపట్నం గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన బీటీ రోడ్డు పక్కకు కోతకు గురైంది. కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వట్టివాగును డీఎస్పీ సత్యనారాయణ పరిశీలించారు.

– సాక్షి నెట్‌వర్క్


నర్సింహులపేట: కౌలస్యదేవిపల్లిలో అకేరు వాగు ఉధృతికి ధ్వంసమైన రోడ్డు


డోర్నకల్: వరి పొలాల్లో ఇసుక మేటలు


మహబూబాబాద్ రూరల్: ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ


మరిపెడ: పురుషోత్తమాయగూడెం ఆకేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీ కవిత


నెల్లికుదురు: రావిరాలలో చెరువు మత్తడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్


డోర్నకల్: పాతదుబ్బతండాలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్


మహబూబాబాద్ రూరల్: ధ్వంసమైన సింగిలాల్ తండా సమీపంలోని రహదారి


కేసముద్రం: వట్టివాగును పరిశీలిస్తున్న డీఎస్పీ


కురవి: నేరడ-రాయినిపట్నం మధ్య కోతకు గురైన బీటీ రోడ్డు


గార్ల: రాంపురంలో పంట భూముల్లో ఇసుక మేట


నెల్లికుదురు: బ్రాహ్మణకొత్తపల్లిలో తెగిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న ప్రజాప్రతినిధులు


చిన్నగూడూరు: కోతకు గురైన గంగమ్మ అలయానికి వెళ్లే దారి


మరిపెడ రూరల్: లూనావత్‌తండాలో వరద నీటిలో తేలిన జీపీ ట్రాక్టర్


మరిపెడ: వరద నీటికి జాలువారి పాడైన పత్తి చేను


దంతాలపల్లి: పాలేరు వాగు వద్ద పహారా కాస్తున్న పోలీసులు

క్లుప్తంగా

సీఐ, ఎస్సైల బదిలీ

డోర్నకల్: డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల సీఐగా పదోన్నతి పొందిన రవికుమార్ ఖమ్మం ఇంటెలిజెన్స్ సీఐగా బదిలీ అయ్యారు. డోర్నకల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ మహబూబాబాద్ ట్రాఫిక్ ఎస్సైగా, కురవి ఎస్సై మధుబాబు, మరిపెడ ఎస్సై ఝాన్సీ డోర్నకల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

రెండో ఎస్సైగా రాజయ్య

కేసముద్రం: కేసముద్రం రెండో ఎస్సైగా కంటాత్మకూర్ రాజయ్య శుక్రవారం నియామకం అయ్యారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్సైగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కేసముద్రం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం విధుల్లో చేరారు.

ఎస్పీని కలిసిన ఆర్ఐలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్ఐలుగా విధుల్లో చేరిన సీహెచ్.భాస్కర్, కె.సాంబశివరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా వైస్ చైర్మన్‌గా రామునాయక్



బయ్యారం: ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా వైస్ చైర్మన్‌గా బానోత్ రామునాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ అనంతారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫార్మసీ మహిళా కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల కోసం అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వాసంతి శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తుల తోపాటు, బీఫార్మసీ, ఎంఫార్మసీ సర్వీస్ సర్టిఫికెట్లు జిరాక్స్‌లను తప్పనిసరిగా ఆగస్టు 2వ తేదీ వరకు సాయంత్రం 4గంటల వరకు కళాశాలలో అందజేయాలన్నారు.

సందర్శన నిషేధం

గూడూరు: భారీ వర్షాల కారణంగా భీమునిపాద జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వర్షాలు తగ్గే వరకు పర్యాటకులు ఎవరూ రాకూడదని సీఐ ఫణిధర్, ఎస్సై రాణాప్రతాప్ అన్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భీమునిపాద జలపాతం శుక్రవారం ఉధృతంగా జాలువారుతోంది. పర్యాటక ప్రదేశానికి చేరుకున్న పోలీసులు, తహసీల్దార్ అశోక్‌కుమార్ జలపాత దృశ్యాలను తిలకించారు.

చేపల సందడి



మహబూబాబాద్ అర్బన్: వారం రోజుగా కురుస్తున్న భారీ వర్షాలకు శుక్రవారం మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి రాళ్ల వాగు పొంగుతున్న వరదకు యువకులు వలలు కొనుగోలు చేసి మరి చేపలు పడుతూ.. సందడి చేశారు.

పునరుద్ధరించాలి



మహబూబాబాద్ రూరల్: దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు రద్దు చేసిన సింగరేణి, పుష్‌పుల్ రైళ్ల రాకపోకలు మళ్లీ ప్రారంభించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవి నాయక్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ నాయక్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ టౌన్ అధ్యక్షుడు శంకర్ నాయక్, నరేష్ నాయక్, రవినాయక్, అశోక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అత్యవసర సమాచార కేంద్రం ఏర్పాటు

నెహ్రూసెంటర్: వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, మారుమూల ప్రాంతాల్లోని గర్భిణులు, ప్రజలు సౌకర్యార్థం అత్యవసర సమాచార కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ బి.హరీశ్‌రాజ్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్లతో వర్షాభావ పరిస్థితి, ఆరోగ్య సమస్యలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. డెలివరీ సమయం దగ్గర ఉన్న గర్భిణులను సమీపంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో చేర్పించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రజలు ఆయా గ్రామాలకు సంబంధించిన నర్సులు, ఆశకార్యకర్తలను సంప్రదించాలన్నారు. ప్రజలు వైద్య సిబ్బంది 96766 21992 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. 24 గంటలు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

వరద బాధితులకు సరుకుల పంపిణీ


వరద బాధితులకు సరుకులు అందజేస్తున్న బలరాంనాయక్


వరద బాధితులకు సరుకులు అందజేస్తున్న మురళీనాయక్

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామంలో వట్టివాగు వరద ఉధృతికి, కూలిన ఇళ్ల బాధిత వంద కుటుంబాలకు మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ శుక్రవారం ఒక్కొక్కరికి 10కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. అదే విధంగా ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో వర్షానికి పలువురి ఇళ్లు కూలగ వారి కుటుంబాలకు ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు యాదవరెడ్డి, కేసముద్రం, ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్‌రావు, కూరెల్లి సతీష్ పాల్గొన్నారు.

మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో వరద బాధితులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు మురళీనాయక్ బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొమురయ్య, దాసు, యాకన్న పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన వారికి సన్మానం


సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

మహబూబాబాద్: వర్షాలు కురుస్తున్న సమయంలో వరదలో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వరదలో చిక్కుకున్న వారిని ప్రాణాలు కాపాడిన వారిని సన్మానించారు. మున్నేరువాగు సమీపంలో వరదలో చిక్కుకున్న మల్లయ్యను శివకుమార్‌తోపాటు ఐదుగురు కాపాడారన్నారు. దామరకుంట, కృష్ణస్వామి కుంటలు ఉప్పొంగడంతో దానికి సమీపంలో ఉన్న కాలనీలకు వరదనీరు చేరగా డొలాగర్ శంకర్‌తోపాటు పలువురు కలిసి వరదలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మార్నెని వెంకన్న, బుజ్జి వెంకన్న, డీఈ సీహెచ్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక గర్జనను జయప్రదం చేయండి


మరిపెడలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మరిపెడ: ఆగస్టు 4న రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక గర్జనను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. మరిపెడలో ఈమేరకు వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోమయ్య, శ్రీను, అరుణ్, వెంకన్న, సాయిలు, మహేష్, మనోజ్, రమేష్, లక్ష్మీ, వెంకటప్ప, నాగమ్మమ, సుశీల, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆగస్టు 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే కార్మిక గర్జనను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బిల్లకంటి సూర్యం అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం కార్మిక గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య, నాయకులు సోమయ్య, శ్రీను, అరుణ్, వెంకన్న, సాయిలు, మహేష్, మనోజ్, రమేష్, లక్ష్మీ పాల్గొన్నారు.

కవి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

దంతాలపల్లి: మండలం శ్రీశ్రీ కళా వేదిక మహబూబాబాద్ జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో దంతాలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆగస్టు 12న ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లాలో నిర్వహిచే కవి సమ్మేళనం పోస్టర్‌ను శుక్రవారం తహసీల్దార్ శివాని ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక వారి లేపాక్షి కవిత వైభవం 122వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో సాహితి ప్రియులు పాల్గొని కవి సమ్మేళనం విజయవంతం చేయాన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం ఉపాధ్యక్షుడు చిర్ర సతీష్, ఆర్ఐ నిజాముద్దిన్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మహబూబాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ టి.ప్రసన్నరాణి అన్నారు. జీవవైవిధ్య కమిటీ, ప్రజా హృదయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న, వార్డు కౌన్సిలర్ వెంకన్న పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

డోర్నకల్: గ్రామీణ స్థాయిలో బీజేపీ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని బీజేపీ నాయకుడు ప్రభాస్‌నాయక్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బాసాని నాగేశ్వర్‌రావు, నాయకులు గణేష్‌నాయక్, దేవా, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడకు చేరిన జీపుజాతా

మరిపెడ: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి పోరు జీపుజాత శుక్రవారం మరిపెడకు చేరుకుంది. ఈసందర్భంగా మరిపెడలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వీరబాబు మాట్లాడుతూ.. జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని జీపుజాతా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపాడు. కార్యక్రమంలో మధు, జ్యోతిబసు, జ్యోతి, రజిత, అమీర్, జశ్వంత్, అనిల్, అఖిల్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో సామగ్రి దగ్ధం

మరిపెడ రూరల్: ప్రమాదవశాత్తు గ్యాస్ పోయి వద్ద మంటలు వ్యాపించి ఇంట్లో విలువైన సామగ్రితోపాటు నగదు, నగలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.2లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలోని దళిత కాలనీలో శుక్రవారం ఉదయం జినక లక్ష్మి గ్యాస్ వద్ద వంట చేస్తుంది. ఈక్రమంలో మసిగుడ్డకు మంటలు వ్యాపించడంతో పక్కనే ఉన్న ఫ్రిడ్జికి అంటుకున్నాయి. ఫ్రిడ్జి షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు మరింత దట్టంగా వ్యాపించాయి. సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టమైనట్లు బాధితురాలు విలపించింది.

దొంగ అరెస్ట్

డోర్నకల్: డోర్నకల్ పట్టణంలో చోరీకి ప్రయత్నించిన ఓ దొంగను అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ ఎస్సై శ్యాంసుందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. డోర్నకల్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం చెందిన రామచందర్‌గా గుర్తించామని, ఈనెల 26న సుభాష్ వీధిలోని ఓ ఇంట్లో చోరీకి ప్రయత్నించి పారిపోయినట్లు విచారణలో తెలిసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్షీరాభిషేకం

దంతాలపల్లి: పాలేరు వాగుపై బ్రిడ్జి మంజూరైన సందర్భంగా మండలం పెద్దముప్పారం గ్రామంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ హిమబిందు చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

మరిపెడ: వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న డిమాండ్ చేశారు. మరిపెడలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.600 కూలి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నందాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, మధుసుదన్, సోమన్న, మనుసూరు పాల్గొన్నారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: సుపరిచితులు మహబూబాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ మైనారిటీ నాయకులు రిటైర్డ్ టీచర్ షేక్ దావూద్ సార్ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆయన మృతదేహానికి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ

నెహ్రూసెంటర్: పట్టణంలో కరిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు పలు చోట్ల నేలమట్టమయ్యాయి. జిల్లా కేంద్రంలోని కొండపల్లి గోపాల్‌నగర్‌కాలనీతో పాటు పలు చోట్ల కూలిన విద్యుత్ స్తంభాల చోట కొత్త స్తంభాలను శుక్రవారం ఏర్పాటు చేసి విద్యుత్ వచ్చేలా చర్యలు చేపట్టారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా అధికారులు వెంటనే స్పందించి పనులను చేపట్టి విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి



నెల్లికుదురు: విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని వావిలాల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతుల నల్ల ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కురుస్తున్న గాలివానలకు రాత్రి విద్యుత్ తీగలు రెండు పాడిగేదెలపై తెగిపడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు.

రామచంద్రయ్య సేవలు చిరస్మరణీయం

నెహ్రూసెంటర్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి దేశెట్టి రామచంద్రయ్య పార్టీ అభివృద్ధికి కృషి చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ సబ్ డివిజన్ సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్ కొనియాడారు. జిల్లా కేంద్రంలోని రామచంద్రయ్య సంతాప శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు చైతన్య, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి మధు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మట్కీలకు పూజలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో 9వ రోజు మొహర్రం సందర్భంగా శుక్రవారం పెద్ద ఎత్తున గ్రామంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో మట్కీలను తయారుచేసి పూజలు చేశారు. గ్రామ ఊరు గుట్టలో మహబూబ్ సుభాని దర్గా వద్ద, గ్రామంలో ఏర్పాటు చేసిన గుండం వద్ద మట్కిలతో తిరుగుతూ భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో ఉండాలని, సుఖసంతోషాలు కలిగించాలని వేడుకున్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కురవి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2023–24 సంవత్సరంలో పండ్ల తోటల పెంపకానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఓ యాకాంబ్రం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, సన్న చిన్న కారు రైతులు, ఐదు ఎకరాల లోపు ఉనన పట్టాదారులు, ఉపాధి జాబ్ కార్డు కలిగి, బోరు బావి విద్యుత్ సౌకర్యం ఉన్న రైతులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు పత్రం, పాసుబుక్, ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, జీపీ తీర్మానం కాపీతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి(గట్ల వెంబడి మాత్రమే), డ్రాగన్ ఫ్రూట్(కేవలం అర ఎకరం), సపోట, ఆయిల్‌పామ్, బత్తాయి, అల్లనేరేడు తోటలు పెట్టుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులకు చివరి తేది ఈనెల 31 వరకు ఉంటుందని తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



పెద్దవంగర: పోచంపల్లి గ్రామంలో వరద ప్రవాహంలో ఇటీవల గల్లంతై మృతి చెందిన పిండి యాకయ్య, పిండి శ్రీను కుటుంబాలకు కాంగ్రెస్ నియోజకవర్గ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి లక్ష రూపాయల నగదును ప్రకటించారు. సదరు మొత్తాన్ని టీపీసీసీ మాజీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, తిరుపతిరెడ్డి ద్వారా శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఒక్కొరికి రూ.50వేల చొప్పున రెండు కుటుంబాలకు రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున రెడ్డి, తిరుపతి రెడ్డి, అచ్చిరెడ్డి, హమ్యానాయక్, సురేష్ పాల్గొన్నారు.